

'చిలుకూరి'కి రామలింగస్వామి పురస్కారం



ప్రజాశక్తి - కడియం

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత డాక్టర్ కొణతాల రామలింగస్వామి స్మారక పురస్కారం కడియానికి చెందిన విద్యావేత్త, పర్యావరణవేత్త చిలుకూరి శ్రీనివాసరావుకి లభించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో నిష్ణాతులను ఎంపిక చేసి డాక్టర్ కొణతాల రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్ ఏటా అవార్డుతో సత్కరిస్తోంది. ఈ ఏడాది ఏడుగురిని ఎంపిక చేసింది. ఈనెల 14న అనకాపల్లిలో జరిగే అవార్డుల ప్రధానోత్సవంలో ప్రముఖులు చేతుల మీదుగా శ్రీనివాసరావు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ మేరకు ట్రస్ట్ ఛైర్మన్ కొణతాల లక్ష్మీపార్వతి నుంచి తనకు ఆహ్వానం అందినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిష్టాత్మక అవార్డుకు శ్రీనివాసరావు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



టిడిపి కంచుకోటపై వైసిపి కన్ను

టిడిపి కంచుకోటపై వైసిపి కన్నేసింది. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ స్థానాలను ఎలాగైనా కైవశం చేసుకోవాలని అధికారపక్షం ఆరాటపడుతోంది. అందులో భాగంగా అభ్యర్థులను సైతం మార్చింది. రానున్న ఎన్నికల్లో అందని ద్రాక్షలా ఉన్న ఈ స్థానాలను ఒడిసి పట్టుకునేందుకు నానా ప్రయత్నాలు ప్రారంభిస్తోంది. అయితే నాయకుల సమన్వయం అధిష్టానానికి పెద్ద సమస్యగా మారింది.

- వైసిపికి అందని ద్రాక్షలా రాజమహేంద్రవరం సిటీ, రూరల్ స్థానాలు
- తాజాగా అభ్యర్థుల మార్పుతో రంజుగా రాజ'కీ'యం
- సిటీ అసెంబ్లీ బరిలో వైసిపి నుంచి ఎంపీ భరత్, రూరల్‌కు మంత్రి వేణు
- ఖరారు కాని టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులు
- బిజెపిలోనూ అదే తీరు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

2014 ఎన్నికల్లో రాజమహేంద్రవరం సిటీ నుంచి టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి భవాని వైసిపి అభ్యర్థి రౌతు సూర్యప్రకాశరావుపై దాదాపుగా 30 వేల మెజార్టీతో గెలుపొందారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గంలోనూ వైసిపి అభ్యర్థి ఆకుల వీర్రాజుపై టిడిపి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి 11 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గం ఏర్పడిన తర్వాత 2009లో చందన రమేష్, 2014, 2019లో వరుసగా రెండు సార్లు టిడిపి అభ్యర్థి గోరంట్ల విజయం సాధించారు. మరోవైపు రాజమహేంద్రవరం మేయర్ ఎన్నికల్లో చక్రవర్తి, అనంతరం ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, తరువాత పంతం రజనీశేషసాయి వరుసగా మూడు సార్లు మున్సిపల్ కార్పొరేషన్‌పై టిడిపి జెండాను ఎగురువేశారు. 2019లో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి విజయ దుందుభి మోగించినప్పటికీ రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌లో మాత్రం చతికిలపడింది. రెండు నియోజక వర్గాల్లోనూ ఫ్యాన్‌కు ఎదురుగాలి తప్పలేదు. దీంతో రాబోయే 2024 ఎన్నికల్లో ఎలాగైనా ఎదురుగాలిని అనుకూలంగా మలుచుకుని విజయఢంగా మోగించాలని చూస్తున్నా.. అది అధికార పార్టీకి కత్తిమీద సామే.

ఓటమి భయంతోనే కార్పొరేషన్ ఎన్నికలకు వెనకడుగు..?

2021లో జరిగిన పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్‌ల ఎన్నికల్లోనూ వైసిపి విజయ పరంపర కొనసాగించింది. అయితే రాజమహేంద్రవరంలో అప్పటికీ ఆ పార్టీకి అంత సానుకూలత కన్పించలేదు. కేవలం ఓటమి భయంతోనే సాంకేతిక కారణాలు సాకుగా చూపిస్తూ కార్పొరేషన్ ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసిందనే విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే సిటీ, రూరల్ నియోజక వర్గాల్లో ఆ పార్టీ పట్టుపెంచుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేసింది. మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు రాజకీయ వారసుడు జక్కంపూడి రాజా రాజానగరం ఎంఎల్‌ఎగా ఉన్నప్పటికీ రాజమహేంద్రవరంలోనే ఆయనకు అనుచరగణం అధిక సంఖ్యలో ఉంది. మరోవైపు ఎంపీ భరత్ రామ్ 'గుడ్ మార్నింగ్' పేరుతో ఏడాదిగా డివిజన్లలో పర్యటిస్తూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. మరోవైపు ఆ పార్టీ రూరల్ కో-ఆర్డినేటర్‌గా పనిచేసిన చందన నాగేశ్వర్ సైతం తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు శాయశక్తులా కృషి చేశారు. ఇంత ప్రయత్నం చేసినా చివరికి ఐ ప్యాక్ సర్వే ఫలితాలు పూర్తి భిన్నంగా రావడంతో ఆ పార్టీ అధినాయకత్వాన్ని డైలమాలో పడేసింది.

నాయకుల మధ్య సమన్వయ లోపం

2014, 2019 రెండు ఎన్నికల్లోనూ వైసిపి నాయకుల మధ్య సమన్వయ లోపం ఆ పార్టీక తలపోటుగా మారింది. సిటీ నియోజక వర్గంలో 2014లో బొమ్మన రాజ్‌కుమార్, 2019లో రౌతు సూర్యప్రకాశరావు ఈ కారణంగానే ఓటమి పాలయ్యారు. రూరల్ నియోజక వర్గంలో ఆకుల వీర్రాజు 2014, 2019 వరుసగా రెండు సార్లూ ఓటమి చవిచూశారు. ఈ ఓటమి వెనుక అసంతృప్తుల నేపథ్యంలో స్వపక్ష నేతలే సహకరించలేదనే సుస్పష్టం. ఈ కారణంగానే కొంత కాలంగా రౌతు సూర్యప్రకాశరావు రాజకీయాలకు దూరంగా కూడా ఉన్నారు. కొన్నేళ్లుగా ఎంపీ భరత్‌రామ్, రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజాల మధ్య వివాదం నివురుగప్పిన నిప్పులా కొనసాగుతోంది. ఒక దశలో ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు సైతం చేసుకున్నారు. విషయం అధిష్టానం దృష్టికి వెళ్లడంతో ప్రస్తుతానికి వివాదం కొంతమేర సద్దుమణిగింది. అయితే ఎప్పటిప్పుడు తమ బలాబలాను నిరూపించుకుందుకు వారు పోటీ పడుతూనే ఉన్నారు. తాజాగా ఎంపీ భరత్‌రామ్ సిటీ నియోజకవర్గంలో పోటీ దాదాపుగా ఖరారైనట్లే. అయితే ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా ఏ మేరకు సహకరిస్తారో వేచి చూడాల్సి ఉంది. మరోవైపు రూరల్ నియోజక వర్గంలో మూడేళ్లుగా చందన నాగేశ్వర్ అన్నీ తానై పార్టీని నడిపించారు. అక్కడి నేతలను సైతం సమన్వయం చేసుకుని జిల్లా పరిశీలకులైన మిథున్ రెడ్డి ఆశీస్సులను సైతం పొందారు. తాజాగా రూరల్ బరిలో అతన్ని కాదని మంత్రి వేణుగోపాలకృష్ణను అధిష్టానం నియమించింది. దీంతో చందన వర్గం తీవ్ర అసంతృప్తిలో ఉంది. వారు మంత్రి వేణులు సహకరిస్తారా? లేదా?అనేది తేలాల్సి ఉంది. తేడా వస్తే ఈసారీ అధికార పార్టీకి సిటీ, రూరల్‌లో ఎదురుగాలి తప్పదనే సంకేతాలు విన్పిస్తున్నాయి.



ఎస్ఎస్ఎల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు అరుణకుమారి

విధుల్లోకి ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మంత్రి బొత్స సత్యనారాయణతో ఈ నెల 10న జరిగిన చర్చలు సఫలం కావడంతో గురువారం నుంచి ఎస్ఎస్ఎ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరవధిక సమ్మెను విరమించి విధుల్లో చేరారని జెఎసి జిల్లా నాయకులు ఎం.రఘునాథ్, బి.వంశీకృష్ణంరాజు, పి.దుర్గాప్రసాద్, ఆర్.వెంకట్ రాజు, వెంకట్ తెలిపారు. డిఇఒ కార్యాలయం వద్ద 22 రోజులుగా నిర్వహించిన సమ్మెను ఉద్యోగులు విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హెచ్ఆర్ పాలసీ అమలు కోసం ప్రత్యేక కమిటీని వేస్తున్నామని, మూడు కేటగిరీల్లో ఉద్యోగులను వారి సేవలను గుర్తించి ఎంటిఎస్ విధానాన్ని అమలు చేస్తామని, సమ్మె కాలంలో వేతనాలు చెల్లిస్తామని, సమ్మె వల్ల విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి చేర్చుకుంటామని, కారుణ్య నియామకాలు ఇస్తామని తదితర 11 డిమాండ్లు నెరవేర్చడానికి మంత్రి అంగీకరించారన్నారు. దీంతో రాష్ట్ర జెఎసి నాయకుల ఆదేశాల మేరకు సమ్మెను విరమించామని తెలిపారు. సమ్మె విజయవంతం కావడానికి సహకరించిన విద్యాశాఖ అధికారులకు, సిబ్బందికి, ఉపాధ్యాయ సంఘాలు, సిఐటియు, ఇతర కార్మిక, ప్రజా సంఘాలు, పోలీసులు, పాత్రికేయులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి, జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రూపస్‌రావు, మిరపరాజు, చిన్నిబాబు, బుచ్చిబాబు, ప్రబాకర్, సూర్య కుమారి, మోహిని, లీలావతి, శిరీష, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విన్నర్ చిక్కాల జట్టు

ప్రజాశక్తి - చాగల్లు

ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి కబడ్డీ పోటీల్లో చిక్కాల జట్టు విజేతగా నలిచింది. చిక్కాల జడ్‌పి ఉన్నత పాఠశాలలో గురువారం మండల కబాడీ ఫైనల్స్ పోటీలను ఎంపిడిఒ పి.నిర్మలకుమారి ప్రారంభించారు. ఫైనల్లో చిక్కాల, ఉనిగట్ల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆఖరికి చిక్కాల జట్టు విన్నంగానూ, ఉనిగట్ల జట్లు రన్నర్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య మణి, వైసిపి నాయకులు సుంకర రాయుడు, పిటి.స్వామి, చదలవాడ రాజు, తదితరులు పాల్గొన్నారు.



చిక్కాల, ఉనిగట్ల జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న కబాడీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కడియం, ఉండ్రాజవరం

వార్షిక విద్యుత్ మరమ్మతుల నిమిత్తం జేగురుపాడు, కడియం హెడ్ క్వార్టర్ ఫీడర్లకు విద్యుత్ శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడం జరుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్ శాఖ ఇఇ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మండలంలోని కడియం, జేగురుపాడు, కె. సావరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే 33/11 కెవి కడియపులంక విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతు పనుల వల్ల శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక, వెంకాయమ్మపేట, దోసాలమ్మ కాలనీ గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని, కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. ఉండ్రాజవరం మండలంలోని పాలంగి, మోర్త, వేలివెన్ను సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిడదవోలు విద్యుత్ శాఖ ఇఇ బి.వీరభద్రరావు తెలిపారు. కావున ఉండ్రాజవరం, పాలంగి, కె.సావరం, చివటం, తాడిపర్రు, వెలగదుర్రు, మోర్త, చిలకపాడు, దమ్మెన్ను, వేలివెన్ను, కాల్దారి గ్రామాల వ్యవసాయ, వాణిజ్య, ఇతర వినియోగదారులు సహకరించాలని కోరారు. వ్యవసాయ ఫీడర్లకు 3 పిహెచ్ సరఫరా వేళలు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల తరువాత సరఫరా చేస్తామన్నారు.

పరిష్కారం అయ్యే వరకూ పోరాటం

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె గురువారం నాటికి 31వ రోజుకు చేరింది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 24 గంటల రిలే నిరహారదీక్ష జరుగుతుండగా, మండల కేంద్రాల్లో రిలే నిరహారదీక్షలు కొనసాగుతున్నాయి. అయితే ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా లెక్కచేయకుండా అంగన్‌వాడీలు ఉద్యమాన్ని కొనసాగి స్తున్నారు. **రాజమహేంద్రవరం** స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం అంగన్‌వాడీల 24 గంటల నిరహారదీక్షలో రాజానగరం ప్రాజెక్టు అంగన్‌వాడీలు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శ బి.రాజులోవ, ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీ రాణి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు అరుణకుమారి హాజరై మద్దతు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడారు. రాష్ట్రంలో సమస్యలు పరిష్కరించమని స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఇచ్చిన వినతిపత్రాల పట్ల వైసిపి ప్రభుత్వం మొద్దు నిద్రను ప్రదర్శిస్తుందన్నారు. 31 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కర్కసంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తుగా నోటీసు ఇచ్చి సమ్మెలోకి దిగినా ప్రభుత్వం అంగన్‌వాడీలను అత్యవసర సర్వీసుల పరిధిలోకి తీసుకొచ్చి ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు పోలిన.వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు వై.సుజాత, ఎం. మార్తమ్మ, కె.సుజాత, టి.విజయ, కె.ఏడుకొండలు, జె.సునీతా, సరస్వతి, గంగ, విషాలి, చంద్ర, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ అన్నారు. స్థానికంగా జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు తాళ్లను మెడలకు బిగించుకుని మా సమస్యలు పరిష్కరించకపోతే తమకు ఆత్మహత్యలే చరణ్యమంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ రాష్ట్రంలో బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్న ప్రభుత్వం చూసిచూడనట్టుగా వ్యవహరిస్తుందన్నారు. సమస్యలను సానుకూలంగా పరిష్కరించాల్సింది పోయి జటిలం చేసే పద్ధతులను ప్రభుత్వం అవలంబిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.రత్నాజీ, యూనియన్ నాయకులు టిపి.లక్ష్మి, ఎ.పద్మ కామేశ్వరి, కె.వరలక్ష్మి, కె.దేవిసావిత్రి, కె.కుమారి, డివివి.లక్ష్మి, ఉండవల్లి మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు. **నల్లజర్ల** స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని వారు తీవ్రంగా నిరసించారు. అయితే అంగన్‌వాడీలకు మెమోలను అందించేందుకు అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అయితే మెమోలను అంగన్‌వాడీలు నిరాకరిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ, ఆయాల ఇళ్లకు అంటించే కార్యక్రమాన్ని అధికారులు కొనసాగిస్తున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉండ్రాజవరపు మిస్సమ్మ, బేతాల నాగమణి, ఉండ్రాజవరపు జ్యోతి, శాంతివల్లి, తదితరులు నాయకత్వం వహించారు. **చాగల్లు** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల రిలే దీక్ష కొనసాగింది. నిరసన శిబిరాన్ని టిడిపి నాయయకులు ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, జొన్నకూటి వెంకయ్యమ్మ, దొంగ రామకృష్ణ ఈడుపుగంటి మురళి, తాలూరి ప్రసాద్, మాజీ ఎంఎల్‌ఎ, జనసేన పార్టీ నాయకుడు టివి రామారావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే మూడు నెలల తరువాత టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. నిరసన శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్త స్పృహతప్పి పడిపోవడంతో ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించారు. యూనియన్ నాయకులు పి.విజయ్‌కుమారి, కె.లక్ష్మి, కె. దమయంతి, ఎ.శ్రీదేవి, బి.మహాలక్ష్మి, ఎస్.అరుణ్ కుమారి తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన శిబిరంలో రిలే నిరహారదీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన తరువాతే సమ్మెలోకి వచ్చామని అన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని ముఖ్యమంత్రి జగన్ తమ ఉద్యమాన్ని అణిచివేసేందుకు ఎస్మావంటి చట్టాన్ని ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. ఇటువంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **పెరవలి** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్మా వద్దు...జీతాలు ముద్దు అంటూ అధికారులు అందచేస్తున్న మెమో నోటీసులను దహనం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు గౌరవాధ్యక్షులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ నెల రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి కె.కృష్ణవేణి బి.నాగవేణి, సెక్టార్ లీడర్స్ సిహెచ్. విజయ, వి.నిర్మల, కన్యాకుమారి, ఎస్.రాణి, తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన శిబిరంలో రిలే దీక్షలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు పాల్గొని మాట్లాడారు. ఎస్మా చట్టాన్ని రద్దు చేసేంతవరకూ పోరాటం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.రంగనాయకమ్మ, ఎం.జానకి, పివిఎస్.లక్ష్మి, విజయ కుమారి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీల దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్




దేవరపల్లిలో ఉరితాళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



గోకవరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా స్థాయి శిక్షకులతో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజక వర్గ స్థాయిలో నాలుగు ప్రధాన బృందాలతో రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్‌ల ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతోందని అన్నారు. జిల్లా పరిధిలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీగా పోలింగ్ సంబంధ అంశాలు, ఎంసిసి, ఐటి అప్లికేషన్, పోస్టల్ బ్యాలెట్ అంశాలపై ఇద్దరిద్దరు చొప్పున నియమించామని తెలిపారు. వారు నియోజకవర్గ స్థాయిలో నియమించే ఆయా బృందాలకు సమగ్ర శిక్షణ ఇచ్చి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి తమ వంతు బాధ్యత నిర్వర్తించాల్సి ఉందన్నారు. మొత్తం 7 నియోజక వర్గాలకు 75 మందిని నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల తేదీని అనుసరించి ఏ ఏ బృందాలకు ఎప్పుడు ఏ తేదీల్లో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు శిక్షణ ఇవ్వాలో ఆమేరకు సంసిద్ధంగా ఉండాలని, ఆమేరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. శిక్షణ కోసం షెడ్యూల్ తయారీలో శిక్షణ ఇవ్వబడే సబ్జెక్టుల వారీగా పాల్గొనేవారి ఉద్యోగుల సంఖ్యపై అంచనా వేయాలని, నిర్దిష్ట సంఖ్యలో వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. శిక్షణ షెడ్యూల్‌ను ఖరారు చేసే ముందు మాస్టర్ ట్రైనర్‌లు/రిసోర్స్ పర్సన్‌ల లభ్యతను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. శిక్షణ షెడ్యూల్‌ను ప్రకటనకు ముందస్తుగా శిక్షణ కోసం స్థలం గుర్తింపు, ట్రైనింగ్ మెటీరియల్ అందరికీ పంపిణీ చేయాల్సి ఉంటుందని అన్నారు. మునిసిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జిల్లా నుంచి శిక్షణ పొందిన తహశీల్దార్లు, ఎంపిడిఒలు ఆయా సబ్జెక్టలలో ఎన్నికల మార్గదర్శకాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డిఆర్ఒ జి. నరసింహులు పాల్గొన్నారు.



అవగాహన సదుస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మాధవీలత



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న బిసి సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలకృష్ణ

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు రూరల్ మండలం ధవళేశ్వరం బాలుర పాఠశాలలో గురువారం ఎబిసిసి ఫెస్టివల్ - జంగా జాన్సన్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో సంక్రాంతిని ఉత్సాహంగా జరుపుకుంటారన్నారు. ఈ పండుగ నాడు స్నేహితుని పేర క్రికెట్ టోర్నీని నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా ప్రేర క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్ చంద్ర స్టాలిన్, గిరిజాల బాబు, బడుగు చిన్ని, దొంతంశెట్టి వీరభద్రయ్య, ఈలి గోపాలం, ఎస్.సూరిబాబు, ఎన్‌వి.శేఖర్, జంగా జాన్సన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


పెరవలిలో మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వరరావు

కోడి కత్తులు స్వాధీనం

ప్రజాశక్తి - పెరవలి, గోకవరం

సంక్రాంతి సందర్భంగా కోడి పందాల్లో కోడి పుంజులకు కట్టే కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నడిపల్లి కోట గ్రామానికి చెందిన వీం మల్లు రామకృష్ణ కోళ్లకు కట్టేందుకు సిద్ధం చేసిన 40 కోడి కత్తులు, ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామానికి చెందిన నందమూరి వెంకటేశ్వరరావు నుంచి 60 కోడి కత్తులు సీజ్ చేసి ఇరువురుని అదుపులోనికి తీసుకున్నట్లు సిఐ కె.వెకంటేశ్వరరావు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఎవ్వరైనా కోడి పందాలు, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినా, వారికి ఎవ్వరైనా సహకరించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గోకవరంలోని వెలమపేటలో కోడికత్తులు తయారుచేస్తున్న ఎదురాడ వెంకటరమణను అరెస్టు చేసి, అతని నుంచి 277 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శివనాగబాబు తెలిపారు. ఎస్పి జగదీష్ ఆదేశాల మేరకు, నార్త్ జోన్ ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో స్పెషల్ బ్రాంచి సిబ్బందితో దాడులు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు.

సారా బట్టీపై దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో సారా బట్టీలపై దాడుల నిర్వహించి బెల్లపు ఊటను ధ్వంసం చేసి నాటు సారాను సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో చిట్యాల గ్రామం తాడిపూడి కెనాల్ వద్ద నాటు సారా బట్టిపై దాడి చేసి సారా తయారు చేయుచున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా తయారు చేయుటకు నిల్వ చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

పేకాడుతున్న 11మంది అరెస్టు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామంలో రెండు ప్రాంతాలలో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు గోకవరం పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.26,730 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

2 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

అక్రమంగా తరలిస్తున్న 2 టన్నుల రేషన్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లాకు చెందిన కడలి లక్ష్మణ్ రాజానగరంలోని కోళ్ల ఫారాలకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జొన్నాడ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. బియ్యాన్ని గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారని ఎస్ఐ తెలిపారు.

విరవాడలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలో విరవాడలో బుధవారం రాత్రి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు విరవాడ గ్రామంలో ఎస్.అప్పారావు తన భార్య చిన్ని, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. అప్పారావు కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఖమ్మంలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తుండగా అప్పారావుకు గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన ఎన్.సురేష్ పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వీరి మధ్య స్నేహం కొనసాగింది. పది రోజుల క్రితం వీరిద్దరి మధ్య ఏదో విషయమైన వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి సురేష్ విరవాడలోని అప్పారావు ఇంటికి వచ్చాడు. ఇంట్లోనే కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. పిఠాపురం సిఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

100 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రానున్న సంక్రాంతి, ఎన్నికల నేపథ్యంలో 100 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ నాగార్జునరాజు గురువారం తెలిపారు. సంక్రాంతి సందర్భంగా గతంలో కోడిపందేలు, జూదాలు, మద్యం, సారా, గంజాయి అమ్మకాలు నిర్వహించిన వారిని గుర్తించి బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గత ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్ల కేసులో ఉన్న వారందరినీ గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

పోక్సో కేసులో 10 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ

ప్రేమ పేరుతో మోసగించిన గొల్ల అమర్ రాజ్‌కుమార్‌కు కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారని టుటౌన్ ఎస్‌హెచ్ఒ తెలిపారు. 2016లో అన్నమయ్య జిల్లా రాజంపేట గ్రామానికి చెందిన గొల్లా అమర్ రాజ్ కుమార్ అలియాస్ కోనేటి కుమార్ కాకినాడలో ఉంటూ 2016లో 16 ఏళ్ల మైనర్‌ను ప్రేమపేరుతో మోసం చేశాడు. దీనిపై కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పడి డిఎస్‌పి సూర్యదేవర వెంకటేశ్వరరావు దర్యాప్తు చేసి నిందితుని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితునికి పదేళ్ల జైలు విధించారు. నిందితుడు గొల్లా అమర్‌రాజ్‌పై పలు జిల్లాల్లో చోరీ కేసులు కూడా ఉన్నాయి. చోరీల కేసులో బెయిల్‌పై బయటకు వచ్చి ఐదేళ్లుగా కోర్టుకు రాకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో నిందితునిపై నాన్ బెయిలబుల్ వారెంట్‌సైతం ఉంది. నిందితుడిని పట్టుకున్న కాకినాడ టూ టౌన్ పోలీసును ఎస్‌పి ఈ సందర్భంగా అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా మసులుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి చెల్లుబోయిన. శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవలేశ్వరంలోని ప్రభుత్వం జూనియర్ కాలేజ్ గ్రౌండ్ ప్రాంగణంలో వాలంటీర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొనేందుకు ఆయన గురువారం వచ్చారు. అపరిశుభ్రంగా ఉన్న సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన చీపురు తీసుకుని తుడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవలసిన ఆవశ్యకత, బాధ్యత మనపై ఉందన్నారు. పర్యావరణ రక్షణ కొరకు అధిక సంఖ్యలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ ద్వారా కాలుష్యాన్ని నివారించ వచ్చునన్నారు. జల కాలుష్యం, వాయు కాలుష్యం వలన మానవుని మనుగడకు అనేక సమస్యలు ఏర్పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలోఎంపిడిఒలు డి.శ్రీనివాసరావు, కె.రత్నకుమారి, అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చీపురుతో కళావాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న మంత్రి వేణు

సెపక్ తక్రాలో రాణించాలి

ప్రజాశక్తి - రాజానగరం


క్రీడను ప్రారంభిస్తున్న విసి పద్మరాజు

ఎంతో కష్టమైన సెపక్ తక్రా గేమ్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని విసి ఆచార్య కె .పద్మరాజు పిలుపు నిచ్చారు. ఆదికవి నన్న య యూనివర్సిటీలో సెపక్ తక్రా మెన్ యూనివర్సిటీ టీమ్ సెలకన్స్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భం గా విసి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం గోదావరి జిల్లాల్లోని నైపుణ్యం కల క్రీడాకారులకు చక్కని వేదికగా మారిందన్నారు. మారుమూల ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. సెపక్ తక్రా పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరచిన ఏడుగురు విద్యార్థులను యూనివర్సిటీ టీమ్‌గా టి.షణ్ముక్ శ్రీ వంశీ, కె. పవన్‌కుమార్, సిహెచ్.మోహన్‌కృష్ణ, టి.బాలయేసు, జె. బాలనాగేశ్వరరావు, ఎం.దుర్గాచందు, కె. వెంకటసత్యసూర్య ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. సల్మాన్ దేవానంద్, అబ్జర్వర్ సిహెచ్.సుబ్రహ్మణ్యం, మెంబర్ టి.యోగశ్రీ, స్పోర్ట్స్ బోర్డ్ కో-ఆర్డినేటర్ డాక్టర్‌బి.రామ్‌గోపాల్, ఇంజనీరింగ్ కాలేజ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి - చాగల్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్

సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 14, 15, 16 తేదీల్లో కోడి పందేలు, గుండాట వంటివి నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుం టామని ఎస్ఐ సిహెచ్‌వి. రమేష్ హెచ్చరిం చారు. గురువారం కోడిపం దేల నిర్వాహకులు, టెంట్ హౌస్‌ల యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, గుండాట, పేకాట, స్కిల్ కాయిన్స్, మద్యాన్ని అక్రమంగా అమ్మకాలు చేయడం వంటివి పూరి‌గా నిషేధించడం జరిగిందని తెలిపారు. మండ లంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారని, ఈ బృందాలు ఆ మూడు రోజులపాటు విస్తృతంగా దాడులు నిర్వహిస్తాయని చెప్పారు. కావున ఆయా జూద క్రీడలు నిర్వాహకులతోపాటు, వాటిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూద క్రీడలకు టెంట్ హౌస్ యజమానులు టెంట్లను అద్దెకు ఇచ్చినట్లు అయితే వాటిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని, వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదర్శప్రాయంగా కొవ్వూరు నియోజకవర్గం

ప్రజాశక్తి - చాగల్లు

ఎక్కడా లేనివిధగా చేపట్టిన అభివృద్ధితో కొవ్వూరు నియోజకవర్గం ఆదర్శప్రాయంగా నిలుస్తుందని హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. గురువారం చాగల్లు నుంచి లక్ష్మీపురం వరకు రూ.7.80 కోట్లతో నిర్మించే బిటి రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చాగల్లు గ్రామంలోని జుట్టా వారి వీధి నుంచి లక్ష్మీపురం వరకూ 10 కిలోమీటర్ల రోడ్డుకు పంచాయితీ రాజ్ శాఖ నుంచి నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. సిఎం జగన్ పాలనలో కొవ్వూరు నియోజకవర్గానికి ఒక బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కొవ్వూరు మున్సిపాలిటి పరిధిలో లేని గ్రామాలను రుడా పరిధిలోకి తీసుకువచ్చి ఆయా గ్రామాల రూపురేఖలు మార్చామన్నారు. అలాగే సుదీర్ఘకాలంగా విజ్జేశ్వరం బ్యారేజ్ వద్ద ఉన్న రోడ్డు సమస్యకు ఇటీవల మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలతో ప్రభుత్వంపై బురద జల్లాలని చూస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నమట్ల మనశాంతి, ఉప సర్పంచ్ మేకరాజు, జుట్ట కొండలరావు, గంద్రోతు సురేంద్ర, చెల్లింకులు దుర్గ మల్లేశ్వరావు, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ పాతూరు నిర్మల కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి సిమెంట్ కుర్చీల బహూకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రరం

ఆనంద నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు కూర్చొనేందుకు తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం(అరసం) కార్యవర్గ సభ్యుడు, రచయిత మల్లెమొగ్గల గోపాలరావు రూ.10 వేలు విలువచేసే రెండు సిమెంట్ కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్ అహ్మద్, అరసం జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు గోపాలరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది సిబ్బంది వెంకట్, రమేష్, గౌతమి, నూతన, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే బిసిల అభ్యున్నతి


చేతులెత్తి అభివాదం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గోపాలపురం

బిసిల అభ్యున్నతికి విశేష కృషి చేసింది టిడిపియేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. గురువారం వాదాలకుంటలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కాకర్ల శ్రీరామ్ అధ్యక్షతన టిడిపి నాయకులు జయహో బిసి సభ జరిగింది. ఈ సభకు మద్దిపాటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగన్మో హన్‌రెడ్డి ప్రభుత్వం అరాచక పాలన చేస్తుందన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు బనాయించి జైలపాలు చేస్తుందన్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రాను న్నాయని, కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేసి టిడిపిని గెలిపిం చాలన్నారు. గ్రూపుల పోరును వీడి పార్టీ విజయంపై దృష్టి పెట్టాలన్నారు. మహిళా సాధికారిత, సాంకేతిక పరిజ్ఞాన రంగంలో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయికి తీసుకు వెళ్లిన ఘనుడు చంద్రబాబు నాయుడు అని గుర్తు చేశారు. జగన్ విధ్వంసకర పాలన చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మీరా, రాష్ట్ర మహిళా కార్యదర్శి మజ్జి పద్మావతి, జోన్-2 కో-ఆర్డినేటర్ చెల్లు బోయిన శ్రీనివాస్, పార్లమెంటు మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉమర్, మండల అధ్యక్ష కార్యదర్శులు రొంగల సత్య నారాయణ, వడ్లమూడి రమేష్, నియోజక వర్గ మహిళ అధ్యక్షులు కాకర్ల రామతులసి, యంత్ర ప్రగడ మంగారావు,జేష్ట శ్రీనివాసరావు గెడా జగ్గారావు, బిసి సంఘాల నాయకులు హాజరయ్యారు.

కోడిపందేలను ప్రోత్సహించొద్దు

ప్రజాశక్తి - పెరవలి


పందేల బరులను పరిశీలిస్తున్న తహశీల్దార్

కోడి పందేలను ఎవరూ ప్రోత్సహించవద్దని తహశీల్దార్ టి.రాజేశ్వరి ఆదేశించారు. మండలంలోని అజ్జరం, పిట్టల వేమవరం గ్రామాల్లో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కోడిపందాలు ఆడేందుకు సిద్ధం చేసిన బరులను తహశీల్దార్ టి.రాజేశ్వరి గురువారం పరిశీలించారు. సంబంధిత స్థలాలకు సంబంధించిన యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఎటువంటి జూద క్రీడలకు అనుమతి లేవని, కోడిపందాలు, పేకాట, గుండాట వంటి జూదాలను ఎవ్వరూ ప్రోత్సహించవద్దని సూచించారు. కోడిపందాలు, ఇతర జూద క్రీడలు ఆడించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సర్పంచ్ గారపాటి నాగ సుధా, విఆర్‌ఓ సొంగరాజు, గారపాటి నాగభూషణం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు 'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం


సాయాన్ని అందిస్తున్న మానవతి సభ్యులు

మండలంలోని తాడిపర్రులో ఇటీవల పేరూరి రామబ్రహ్మనం దాచారి మృతి చెందారు. మృతుడు ఆర్థికంగా పేద కుటుంబం కావడంతో ఉండ్రాజవరం మానవత మండల శాఖ ఆధ్వర్యంలో అతని భార్య రామలక్ష్మికి గురువారం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తాతిన వెంకటకృష్ణారావు, జె.చంద్రప్రసాదు, ఎన్‌వికె.పాపారావు, వెలిచేటి బోస్, వాకలపూడి రామకృష్ణ, సుంకవల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని అనంతపల్లికి చెందిన వెలగన నాగేశ్వరరావును నాటు సారా విక్రయిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామని ఎస్ఇబి సిఐ డి.సుధ తెలిపారు. అతని నుంచి 20 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎస్ఇబి అధికారులు, సిబ్బంది పి.సుధీర్, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం 216 జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. యానాం వైపు నుంచి వస్తున్న కారు, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులను ఢీకొంది. ఈ ప్రమాదంలో కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి సుదర్శన్, అమలాపురానికి చెందిన సూర్య, రాజమహేంద్రవరానికి చెందిన కె.లలిత్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కోరంగి పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలాకి చేరుకున్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - బిక్కవోలు

చెట్టుకు ఉరి వేసుకుని ఒక వ్యక్తి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బిక్కవోలు గ్రామ శివారు లింగాల చెరువు గట్టుపై ఉన్న చెట్టుకు ఒక గుర్తి తెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందాడు. చెరువు కాపలాదారుడైన తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మాదే పాతయ్య ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ బుజ్జిబాబు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉంటుందన్నారు. మృతిని శరీరంపై ఎరుపు రంగు బనియన్, పచ్చరంగు షర్ట్ ఉందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

సంక్రాంతిని ఉత్సాహంగా చేసుకోవాలి


సంక్రాంతి సంబరాల్లో ఎంపిపి శ్రీవల్లి, ఇతరులు

ప్రజాశక్తి - గోకవరం

సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని గోకవరం ఎంపిపి సుంకర శ్రీవల్లి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. రంగవల్లులను తిలకించారు. భోగి మంటను వెలిగించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమరం శ్రావణి, మాజీ ఎంపిటిసి పులపర్తి బుజ్జి, తోలేటి రాంప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాస్, పలువురు గ్రామ పెద్దలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాణిక్ ఠాగూర్‌ను సత్కరించిన అరుణ కుమారి


మాణిక్ ఠాగూర్ ను సత్కరిస్తున్న అరుణ కుమారి

ప్రజాశక్తి - పెరవలి

విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎపి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్ ఠాగూర్‌ను తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు.

ముద్రగడను కలిసిన జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - కిర్లంపూడి

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంను కిర్లంపూడిలో ఆయన నివాసం గురువారం కలిశారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని జరిగే మహా కుంభాభిషేకానికి ముద్రగడను ఆహ్వానించేందుకు వచ్చానని నెహ్రూ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తున్న తరుణంలో తనకు మద్దతు తెలపాలని ముద్రగడను కోరానని తెలిపారు. ముద్రగడ వ్యక్తిగతంగా తనకు సంపూర్ణ మద్దతు తెలుపుతాన న్నారని నెహ్రూ చెప్పారు. జనసేన నాయకులు కలిసిన మరునాడే నెహ్రూ కలవడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం


క్రీడల్లో ఉత్సాహంగా క్రీడాకారులు

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా గురువారం మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. స్థానిక పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కబాడీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భ:గా ఎంపిడిఒ కె.రమేష్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన వారిని ఫైనల్‌కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

జ్ఞాననిధిలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - సీతానగరం.

మండలంలోని రఘుదేవపురం జ్ఞాననిధి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రమా నర్సింగ్ హోమ్ డాక్టర్ శశికళ, సద్గురు ఆశ్రమం సిఇఒ హాజరయ్యారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పాఠశాల ప్రాంగణాన్ని ముగ్గులతో అలంకరించారు. సంక్రాంతి వ్రతాన్ని ఆచరించి భోగిమంటలు వేశారు. తీన్మార్ డప్పులతో భోగిమంటల అనంతరం పిల్లలకు భోగి పళ్ళు తలంబ్రాలుగా ఆశీర్వాదించారు. పల్లెల్లో తెలుగుదనం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థులు గీతాలకు నత్యాలు చేశారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థి విద్యార్థులకు డాక్టర్ శశికళ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. సంక్రాంతి సంబరాలపై జ్ఞాననిధి ఛైర్మన్ మంగరాజు మాట్లాడారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగులకు ఆర్థిక సాయం


ఎస్ఎస్ఎ ఉద్యోగులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - గోపాలపురం

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉపాధ్యాయులు ఆర్థిక సాయాన్ని అందించారు. తమ హక్కుల కోసం ఉద్యమించిన ఉద్యోగులకు ఒక్కక్కరికీ రూ.5 వేలు చొప్పున మండలంలోని 12 మంది ఉద్యోగులకు రూ.60 వేలను మండలంలోని ఉపాధ్యాయులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4 నెలల నుంచి జీతాలు లేక న్యాయమైన డిమాండ్ల సాధనకై గత 22రోజుల నుంచి సమ్మె చేస్తూ ధర్నాలు, నిరసనలు తెలుపుతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యమానికి మద్దతు ఇచ్చామన్నారు. గోపాలపురం మండలంలో విధులు నిర్వహిస్తున్న 12 మంది సిబ్బంది కుటుంబాలకు ఆసరాగా మండలంలోని ఉపాధ్యాయుల తరపున నిధులను సమీకరించి రూ.60 వేలు నగదును అందించినట్లు తెలిఆరు. ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకు వచ్చిన మండలంలోని ఉపాధ్యాయులకు, హెచ్‌ఎంలకు ఎస్ఎస్ఎ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఆరుగొలను జాన్‌బాబు, గంగులకుర్తి వెంకటేశ్వరరావు, మెరపల నాగేశ్వరరావు, ఎపిటిఎఫ్ నాయకులు సనపల రాజశేఖర్, కొండేపాటి శ్రీనివాస్, బోడా వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం


షటిల్ బ్యాడ్మింటన్‌ను ప్రారంభిస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి - కడియం

కడియం పోలీసు స్టేషన్ వద్ద ఉన్న ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న షటిల్ టోర్నీ గురువారం రపారంభమైంది. రాజమ హేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి కె.శ్రీనివాసులు టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే టోర్నీలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. అన్ని వయసుల వారు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలనానరు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో క్రీడలను ఒక భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ పివిజి.తిలక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ స్మృతి వారోత్సవాలు


ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి, ఇతరులు

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక గ్రామ సచివాలయం వద్ద గురువారం అంబేద్కర్ స్మృతి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు ఈ సందర్భంగా సభికులతో సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉందుర్తి వెంకటేశ్వర్లు, నేకూరి కనకారావు, నేకూరి వెంకటేశ్వర్లు, సొంగ ఆంజనేయులు, రాచర్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు


పంచాయతీ వద్ద సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి - తాళ్లపూడి

సంక్రాంతి పండగ పేరుతో గ్రామాల్లో కోడిపందాలు, గుండాట వంటి జూదాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ జూదాలకు దూరంగా ఉండేలని, ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్రాంతి పండుగ సాంప్రదాయ రీతిలో ప్రజలు జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రాధిక, ఎంపిడిఒ రమణ, ఎస్ఐ కెవి.రమణ పాల్గొన్నారు. అలాగే తాళ్లపూడి పంచాయితీ కార్యాలయం వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.